సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
బుధవారం । 22 । ఫిబ్రవరి । 2023



ఉచ్చుకు బలైంది చిరుతపులే

భూపాలపల్లి అడవుల్లో ఉచ్చుకు బలి అయింది చిరుతపులి అని అటవీశాఖ అధికారులు నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. - 8లో



గంజాయి స్మగ్లింగ్ ముఠా అరెస్ట్

గంజాయ స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ముఠా టాస్క్‌ఫోర్స్, ఆత్మకూరు పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేసినట్లు ఈస్ట్‌జోన్ డీసీపీ పుల్ల కరుణాకర్ తెలిపారు. - 8లో

గరిష్టం/కనిష్టం
37.0°/19.0°

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు మబ్బులు, సూర్యరశ్మితో వేడిగా ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మార్చి 3న జెడ్పీ సమావేశం

భూపాలపల్లి రూరల్: మార్చి 3న మంజూర్‌నగర్‌లోని ఇల్లందు క్లబ్ హౌస్‌లో ఉదయం 10:30 గంటలకు జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ రఘువరన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో హాజరు కావాలని చెప్పారు.

ఈసారి వారసంత శుక్రవారం

భూపాలపల్లి: భూపాలపల్లి పట్టణంలో ప్రతీ గురువారం జరిగే వారసంతను శుక్రవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ టి.అవినాష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం రోజున వారసంత నిర్వహించే స్థలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి కేటీఆర్ ప్రారంభిస్తారని అన్నారు. ఈ మేరకు ఆ రోజున సంతను రద్దు చేసి శుక్రవారం నిర్వహిస్తామన్నారు. వ్యాపారులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కమిషనర్ కోరారు.

ఫిజికల్ సైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడిగా రఘునాథ్‌రెడ్డి



భూపాలపల్లి రూరల్: ఫిజికల్ సైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడిగా గణపురం మండలం ధర్మారావుపేట స్కూల్ అసిస్టెంట్ బిల్లా రఘునాథ్‌రెడ్డిని, ప్రధాన కార్యదర్శిగా గుండు రాజబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా సైన్స్ అధికారి బర్లస్వామి తెలిపారు. మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఫిజికల్ సైన్స్ టీచర్ల సర్వసభ్య సమావేశంలో సైన్స్ ఫోరం కమిటీని ప్రకటించామన్నారు. త్వరలో పూర్తిస్థాయి ఫోరం కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సైన్స్‌పట్ల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి తీర్చిదిద్దే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ ఫోరం ఉపాధ్యాయులు రేగూరి సుభాకర్‌రెడ్డి, మధు, లక్ష్మణ్‌సింగ్, సత్యనారాయణ, రవీందర్, మొగిలయ్య, రాజేంద్రప్రసాద్, నళిని, శ్రీలత, సుజాత పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీచేసిన రాష్ట్ర కోఆర్డినేటర్



భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం ఎస్‌సీఈఆర్‌టీ రాష్ట్ర కోఆర్డినేటర్ మనోహరాచారి, మానిటరింగ్ టీమ్ తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతుల నిర్వహణపై ఉపాధ్యాయులతో సమీక్ష, వార్షిక పరీక్షల ప్రశ్నపత్రాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి విద్యార్థులకు ఎంతవరకు పాఠ్యాంశాల బోధన జరిగిందనే అంశాలపై అడిగి తెలుసుకున్నారు. 100శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలను సూచించారు. ఈ కార్యక్రమంలో మానిటరింగ్ టీం సభ్యులు ఏవీఆర్ చార్యులు, క్యాలిటీ కోఆర్డినేటర్ లక్ష్మణ్, ఎస్ఆర్‌జీ స్వామిలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలి



భూపాలపల్లి అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తూ పాఠశాలలను బలోపేతం చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాంకుమార్ సూచించారు. మండలంలోని గొల్లబుద్దారం ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండల రవీందర్‌రెడ్డి అధ్యక్షతన ఉపాధ్యాయులు స్వాగత, వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి డీఈఓ రాంకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడి పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన, వారి స్థానంలో వచ్చిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు లక్ష్మణ్, భద్రయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు సమ్మయ్య, గోపి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- జిల్లా ఏర్పడిన తర్వాత 2016లో చిట్యాల తహసీల్దార్ పాల్‌సింగ్, వీఆర్‌ఓ రవీందర్ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు.
- 2018లో మహదేవపూర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, వీఆర్‌ఓ కృష్ణయ్య, వీఆర్‌ఏ భర్త శంకర్ ఏసీబీకి పట్టుబడ్డారు.
- 2018లోనే చిట్యాల డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్ ఏసీబీకి దొరికాడు.
- 2019లో కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ సీసీ ఏబీసికి చిక్కాడు.
- 2021లో భూపాలపల్లి ఆర్డీఓ కార్యాలయంలో పని చేస్తున్న డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ రాములు, సర్వేయర్ పావని, టేకుమట్ల వీఆర్‌ఓ రవీందర్ దొరికారు.

రెవెన్యూ శాఖలోనే..

- 2022 జూలై 22న కాటారం తహసీల్దార్ సునిత లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు.



చచ్చినా వదల్లే..!

ఏసీబీకి పట్టుబడ్డ రేగొండ ఏఎస్‌ఓ..

- రెవెన్యూశాఖలోనే అధికంగా అవినీతి
- పట్టుబడుతున్న వారిలో వీరే అధికం..
- తాజాగా డెత్ సర్టిఫికెట్ కోసం డబ్బులు డిమాండ్

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో లంచగొండి అధికారులు రోజురోజుకూ పెరిగిపోతున్నారు. అధికారుల చేయి తడపనిది పనులు అయ్యే పరిస్థితులు లేవు. రెవెన్యూ శాఖలో అయితే ఇది తారాస్థాయిలో ఉంది. ఇటీవల ఏసీబీ దాడుల్లో పట్టుబడుతున్న వారిలో అధికంగా ఆ శాఖకు సంబంధించిన అధికారులే ఉన్నారు. తాజాగా రేగొండ తహసీల్దార్ కార్యాలయంలో ఏఎస్‌ఓగా విధులు నిర్వర్తిస్తున్న మొగుళ్ల రఘుపతి మరణ ధృవీకరణ పత్రానికి రూ.2వేల లంచం తీసుకుంటూ మంగళవారం జిల్లాకేంద్రంలో ఏసీబీ అధికారులకు పట్టుపడ్డాడు.

5 నెలల్లో ఇద్దరు..

జిల్లాలో గడిచిన ఐదు నెలల్లోనే ఇద్దరు అధికారులు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. గతేడాది సెప్టెంబర్ 3న భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో పనిచేసిన ఎస్సై నరేష్ లంచం తీసుకుంటూ క్వార్టర్స్‌లో పట్టుపడగా ఆరు నెలలు కూడా గడవక ముందే తాజాగా రేగొండ ఏఎస్‌ఓ రఘుపతి రూ.2వేల లంచం తీసుకుంటు పట్టుబడ్డాడు.

ఆర్డీఓ కార్యాలయంలో విచారణ

ఏసీబీకి పట్టుబడిన రఘుపతిని ఏసీబీ డీఎస్పీ కె.సుదర్శన్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయానికి తీసుకువచ్చి విచారణ చేపట్టారు. సంబంధిత పత్రాలను పరిశీలించారు. విచారణ అనంతరం హైదరాబాద్ ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు.

మూడు నెలలుగా తిరిగి..తిరిగి..

రేగొండ మండలకేంద్రానికి చెందిన వడ్లకొండ మల్లికార్జున్ గత ఏడాది డిసెంబర్ 5వ తేదీన మీసేవ కేంద్రంలో తన అత్త ఓడెటి కాంతమ్మ పేరున మరణ ధృవీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. దరఖాస్తును ఏఎస్‌ఓ విచారణ చేపట్టి ఆర్డీఓ కార్యాలయానికి పంపించాల్సి ఉంటుంది. మూడు నెలలు నుంచి దరఖాస్తుదారుడు తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఏఎస్‌ఓను కలుస్తున్నాడు. మంగళవారం జిల్లాకేంద్రంలో డబ్బులు తీసుకుంటూ ఏఎస్‌ఓ రఘుపతి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ



ఏసీబీకి పట్టుబడిన ఏఎస్‌ఓ రఘుపతి



ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు

మంత్రి కేటీఆర్ సభకు భారీగా తరలిరావాలి

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభం
- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి: రేపు(గురువారం) జిల్లాకేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కె.తారకరామారావు బహిరంగసభకు అన్ని వర్గాల ప్రజలు అధికసంఖ్యలో తరలిరావాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కోరారు. జిల్లాకేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మంత్రి కేటీఆర్‌తో పాటు మంత్రులు జగదీశ్వర్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్ పర్యటిస్తారని తెలిపారు. మంత్రి కేటీఆర్ హైదరాబాద్ నుంచి గాంధీనగర్ వరకు హెలికాప్టర్‌లో వస్తాడన్నారు. గణపురంలో తహసీల్దార్ కార్యాలయం, గాంధీనగర్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల ఆశ్రమ పాఠశాల భవనాలను ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం రోడ్డు మార్గాన భూపాలపల్లికి చేరుకొని మంజూర్‌నగర్‌లో సింగరేణి సంస్థ నిర్మించిన 994 క్వార్టర్లు, ఆర్‌అండ్‌బీ అతిథి గృహం, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం, డబుల్ బెడ్ రూం ఇళ్లు, దివ్యాంగుల కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి సుభాష్‌కాలనీలో మినీ స్టేడియం, స్ట్రీట్ వెండర్స్ మార్కెట్, కూరగాయల మార్కెట్ సముదాయాలను ప్రారంభిస్తారని అన్నారు. భోజనం అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారని చెప్పారు. బహిరంగ సభకు సుమారు 50వేల మంది హాజరవుతారన్నారు. ఈ సభలో మంత్రి భూపాలపల్లి నియోజకవర్గానికి భారీగా నిధులు కేటాయించే అవకాశం ఉందన్నారు. జర్నలిస్టుల నివాస స్థలాల కేటాయింపు విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మెడికల్ కళాశాల మంజూరు చేయించానని, బైపాస్ రోడ్డును మంజూరు చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల మంజూరు పారదర్శకంగా జరుగుతుందని, దళారులకు డబ్బులు ఇచ్చి మోసపోవద్దన్నారు. అనర్హులకు ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వబోమని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి వెల్లడించారు. అనంతరం మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్న సింగరేణి క్వార్టర్లు, బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి, వైస్‌చైర్మన్ కొత్త హరిబాబు, టీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు కటకం జనార్దన్, కల్లెపు రఘుపతిరావు, నూనె రాజు, ముంజాల రవీందర్, పైడిపెల్లి రమేష్, గడ్డం కుమార్‌రెడ్డి, పిల్లలమర్రి నారాయణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర

బ్రహ్మోత్సవాల జాతర పోస్టర్ ఆవిష్కరణ

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని కోటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మార్చి 2నుంచి కొనసాగే బ్రహ్మోత్సవాల జాతర పోస్టర్‌ను మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతరలో ముందస్తుగా ఏర్పాట్లు కొనసాగించి భక్తులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ బిల్ల శ్రీనివాస్, చైర్మన్ మాదాడి కరుణాకర్‌రెడ్డి, సర్పంచ్ పబ్బ శ్రీనివాస్, ఎంపీటీసీ ఎర్రబెల్లి రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



జాతర పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

కేటీఆర్ సభకు పకడ్బందీ ఏర్పాట్లు

- ట్రాఫిక్ నియంత్రణ, రెండు హెలిపాడ్‌లు సిద్ధం
- కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి: పకడ్బందీ ఏర్పాట్లతో జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లాలో మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో మంత్రుల పర్యటన నేపథ్యంలో తీసుకోవాల్సిన ఏర్పాట్లపై సంబంధిత ఇన్‌చార్జ్ అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 23న రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో మంత్రులు జిల్లాలో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని వెల్లడించారు. ప్రతీ కార్యక్రమం వద్ద నియమించిన అధికారులు నిర్దేశిత పనులు పూర్తిస్థాయిలో పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. జిల్లాలో మంత్రుల పర్యటన నేపథ్యంలో గణపురం మండలం, భాస్కరగడ్డ వద్ద నిబంధనలు పాటిస్తూ హెలిప్యాడ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. మంత్రుల పర్యటన దృష్ట్యా ప్రత్యేకంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా అధిక శ్రద్ధ వహించాలన్నారు. సింగరేణి కాలనీలో నిర్మించిన క్వార్టర్ల ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి మొక్కలు నాటుతారని తెలిపారు. సింగరేణి కాలనీ వద్ద సంస్థ చరిత్ర, సంస్థ అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వివరిస్తూ ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం జిల్లాలోని నూతన ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ప్రారంభోత్సవం జరుగుతుందని, అక్కడే మంత్రి కేటీఆర్ భోజన విరామం తీసుకుంటారని తెలిపారు. అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించే బహిరంగ సభ కార్యక్రమం పకడ్బందీగా జరగాలని, స్టేజీపై ప్రొటోకాల్ నిబంధనలు పాటించాలన్నారు. జిల్లా అధికార యంత్రాంగం లేదా స్థానిక ప్రజాప్రతినిధులు ఆమోదించిన వారిని మాత్రమే స్టేజీపైకి అనుమతించాలని కలెక్టర్ సూచించారు. బహిరంగ సభ ఆవరణలో ప్రభుత్వ ప్రధాన కార్యక్రమాలు వివరించేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలని, జిల్లాలో అమలు చేస్తున్న కంటి వెలుగు, కేసీఆర్ కిట్, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్, మన ఊరు-మనబడి డిజిటల్ క్లాస్ రూమ్‌ల ఏర్పాటు, విద్యా క్లస్టర్లకు లాప్‌టాప్‌ల పంపిణీ మొదలగు కార్యక్రమాలు వివరిస్తూ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు వివరిస్తూ బ్యానర్లు ఏర్పాటుచేయాలని సూచించారు. జీఓ నంబర్ 58, 76 కింద ఆమోదించిన దరఖాస్తులలో అవకాశం మేరకు కొంత మందికి మంత్రి కేటీఆర్ చేతులమీదుగా పట్టాల పంపిణీ చేసేందుకు ఏర్పాట్లుచేయాలని ఆదేశించారు. అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించే కార్యక్రమానికి పెద్దఎత్తున ప్రజలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని, పార్కింగ్ సమస్య ఉత్పన్నం కాకుండా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ టీఎస్ దివాకర, ఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్


జిల్లాలోకి హాథ్ సే హాథ్ జోడో యాత్ర

- రాత్రి చేరుకొని బసచేసిన టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి
- నేడు చిట్యాల, మొగుళ్లపల్లి మండలాల్లో యాత్ర
- మొగుళ్లపల్లి బహిరంగ సభలో ప్రసంగం

భూపాలపల్లి: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర మంగళవారం రాత్రి 9:30గంటలకు జిల్లాలోకి చేరుకుంది. రేవంత్‌రెడ్డి జిల్లాలోని చిట్యాల మండలకేంద్రంలోని వెంకట్రావ్‌పల్లి(సి)కి మంగళవారం రాత్రి చేరుకున్నారు. అక్కడే బసచేసిన ఆయన నేడు ఉదయం 8గంటలకు రేగొండ మండలంలోని కొడవటంచ శ్రీ లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించనున్నారు. చల్లగరిగె, జూకల్లు గ్రామస్తులతో మాట్లాడుతారు. అక్కడి నుంచి తిరుమలాపూర్ చేరుకొని పాదయాత్ర ప్రారంభిస్తారు. వెంకట్రావ్‌పల్లి(సీ), చిట్యాల, ఏలేటి రామయ్యపల్లి, నవాబ్‌పేట మీదుగా మొగుళ్లపల్లి మండలకేంద్రానికి సాయంత్రం ఐదు గంటలకు చేరుకుంటారు. అక్కడ ఏర్పాటుచేసిన బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి ప్రసంగించనున్నారు. 23నుంచి రాయ్‌పూర్‌లో జరుగనున్న ప్లీనరీలో పాల్గొన్న అనంతరం 28న జిల్లాకేంద్రంలో యాత్ర కొనసాగించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సత్యనారాయణరావు తెలిపారు.

రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం

చిట్యాల: హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా మండలకేంద్రంలోని వెంకట్రావుపల్లి (సీ) గ్రామానికి మంగళవారం రాత్రి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రాగా నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దబ్బెట రమేష్, మధువంశీకృష్ణ, గూట్ల తిరుపతి, గడ్డం కోంరయ్య, దొడ్డి కిష్టయ్య, సతీష్ పాల్గొన్నారు.



స్వాగతం పలుకుతున్న సత్యనారాయణరావు

తూర్పులో జోడో జోష్

రెట్టించిన ఉత్సాహంతో ముందుకు

- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ 'తూర్పు'లో సాగిన యాత్ర
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి విసుర్లు
- అవకాశం ఇస్తే పాలకుర్తిలోనూ పోటీ చేస్తామని 'కొండా' ప్రకటన

సాక్షి, వరంగల్/వరంగల్/రామన్నపేట: హాథ్ సే హాథ్ జోడో యాత్ర వరంగల్ తూర్పు నియోజకవర్గంలో జోష్ నింపింది. నాయకులు, కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో రేవంత్‌రెడ్డితో కలిసి ముందుకు సాగారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ.. స్థానిక నేతల పాలన తీరును విమర్శిస్తూ.. చురకలు అంటిస్తూ చేసిన ప్రసంగం కార్యకర్తలను ఉత్సాహపరిచేలా చేసింది. మంగళవారం సాయంత్రం 6.28 గంటలకు ఎంజీఎం చౌరస్తాకు చేరుకున్న రేవంత్‌రెడ్డి.. రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నాయకులతో కలిసి పాదయాత్రను ప్రారంభించారు. అక్కడినుంచి గోపాలస్వామిగుడి జంక్షన్‌కు చేరుకోగా.. చేనేత కార్మిక సంఘం నాయకుడు చిప్ప వెంకటేశ్వర్లు సమస్యలపై వినతిపత్రం అందించి కండువా కప్పి సన్మానించారు. 6.56 గంటలకు పోచమ్మమైదాన్ సెంటర్‌కు, 7.02 గంటలకు మండిబజార్ దర్గా వద్దకు చేరుకుని ప్రార్థనలు చేశారు. 7.23 గంటలకు వరంగల్ చౌరస్తాకు చేరుకున్న ఆయన ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గుర్రపు బగ్గీని ఎక్కారు. ఆయన వెంట కొండా దంపతులు ఉండగా.. కార్యకర్తలకు అభివాదం చేస్తూ వరంగల్ పోస్టాఫీస్ జంక్షన్‌కు చేరుకున్నారు. రేవంత్‌రెడ్డి, కొండా మురళిని కాంగ్రెస్ నాయకులు భారీ గజమాలతో సన్మానించారు. అనంతరం జరిగిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

అభివృద్ధి అంతా మేం చేసిందే..

వరంగల్ నగరంలో జరిగిన అభివృద్ధి అంతా కాంగ్రెస్ హయాంలో జరిగిందేనని సభ సాక్షిగా చెప్పుకొచ్చారు. ఎంజీఎం, నిట్, కాకతీయ యూనివర్సిటీ కాంగ్రెస్ హయాంలోనే నెలకొల్పినట్లు గుర్తు చేశారు. 'తండ్రీకొడుకు కేసీఆర్, కేటీఆర్‌లకు ఇక్కడ ఉండే భూములు, ఆస్తులపై ప్రేమ ఉంది. కానీ.. అభివృద్ధిపై లేదని, అందుకే ఆలోచన చేయండి.. మార్పు రావాలి' అని సభకు హాజరైన ప్రజలను కోరారు. మరోమారు ఇద్దరు ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, నరేందర్‌లపై బిల్లా రంగాలు అంటూ విరుచుకుపడ్డారు. భూమి, కాలువ, శిఖం, చెరువు, చివరకు పేదలు, బలహీనులు ఉండే ప్లాట్లు కబ్జా చేసుడే పనిగా పెట్టుకున్నట్లు ఆరోపించారు. వైఎస్ హయాంలో ఎంత గుర్తింపు ఉందో.. రాబోయే ప్రభుత్వంలోనూ కొండా దంపతులకు అదే గుర్తింపు ఉంటుందని, ఇక్కడ సురేఖ గెలుపుతో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

అరూరి సొంతూళ్లో 24 బెల్ట్ షాపులంట...

'వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ సొంతూరు ఉప్పుగల్ గ్రామ పంచాయతీలో 12 వార్డులుంటే.. బెల్ట్‌షాపులు 24 ఉన్నాయని అక్కడి మహిళలు అన్నారు. వారు తాగొచ్చి పెట్టే కష్టాలతో జీవితాలు ఆగం అవుతున్నాయన్నారు. అందుకే కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బెల్ట్ షాపులు ఉండకుండా చూస్తా'మని రేవంత్ అన్నారు.



జోడో యాత్రలో పాల్గొన్న రేవంత్‌రెడ్డి. చిత్రంలో కొండా సురేఖ, మురళి



గుర్రపు బండిలో వస్తున్న రేవంత్‌రెడ్డి

పాలకుర్తిలోనూ అవకాశమిస్తే కొండా పోటీ..

'వరంగల్‌లో రేవంత్ సభ అనగానే మంత్రి దయాకర్‌రావుకు నిద్ర పట్టడం లేదు. పాలకుర్తిలో మీరన్నా పోటీ చేయాలి. లేదా మేమైనా పోటీ చేస్తాం. మీ లేదా మా చేతిలో దయాకర్‌రావు ఓడిపోవాలి అని చెబుతున్నాం' అని రేవంత్‌రెడ్డితో మాజీ మంత్రి కొండా సురేఖ అన్నారు. 'నేను ఒక్క తల్లి, తండ్రికి పుడితే టీడీపీని వీడను అని దయాకర్‌రావు.. అన్నడు. బీఆర్‌ఎస్‌లో ఎప్పుడు చేరాడో అప్పుడే సచ్చిపోయిండు. చంపిన పామును చంపాల్సిన అవసరం మాకు లేదు. ఇక వరంగల్ ఈస్ట్ విషయానికొస్తే.. మా హయాంలోనే కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశాం' అని సురేఖ చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో వరంగల్ ఇన్‌చార్జ్ అంజనీకుమార్ యాదవ్, ములుగు ఎమ్మెల్యే సీతక్క, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి, సిరిసిల్ల రాజయ్య, దొమ్మాటి సాంబయ్య, వేం నరేందర్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, కొండా సుస్మితా పటేల్, నమిండ్ల శ్రీనివాస్, ఎర్రబెల్లి స్వర్ణ, రవళిరెడ్డి, బట్టి శ్రీనివాస్, సుధాకర్‌గౌడ్, అయూబ్‌ఖాన్, మీసాల ప్రకాశ్, కూరతోట సదానందం, మడిపెల్లి కృష్ణగౌడ్ పాల్గొన్నారు.

కేయూను సందర్శించిన బ్రిటీష్ వర్సిటీ ప్రతినిధులు

విదర్భ రాష్ట్రం కోసం ర్యాలీ

జాతీయస్థాయిలో కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ

- 10లో



దాడులు సరికాదు

భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక పార్టీ కార్యకర్తలపై బీఆర్‌ఎస్ నాయకులు దాడులు చేయించడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రకాశ్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపుతున్న హనుమకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకుడు తోట పవన్‌పై అధికార పార్టీ నాయకులు చేసిన దాడిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఇలాంటి నీచరాజకీయాలు ప్రజాసామ్యంలో తగవన్నారు. పవన్‌కు ఏమి జరిగినా స్థానిక బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేతోపాటు, ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. దాడికి పాల్పడిన రాజకీయ గుండాలను అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ అర్బన్ అధ్యక్షుడు దేవన్, టీపీసీసీ సభ్యులు చల్లూరి మధు, బ్లాక్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భవన సుందర్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు బట్టు కర్ణాకర్, నాయకులు రమణాచారి, పిప్పాల రాజేందర్, ఉస్మాన్, సురేష్, విజేందర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాశ్‌రెడ్డి

ఉపాధ్యాయుల వివాహేతర సంబంధం బట్టబయలు

- రెడ్‌ హ్యాండెడ్‌గా పట్టుకున్న భర్త
- కట్టేసి పోలీసులకు అప్పగింత


నాగేందర్‌ను పోలీసులకు అప్పగించేందుకు తీసుకెళ్తున్న దృశ్యం

మంగపేట: ఇద్దరు ఉపాధ్యాయుల మధ్య వివాహేతర సంబంధాన్ని భర్త బట్టబయలు చేశాడు. రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని పోలీసులకు అప్పగించాడు. ఈ ఘటన మంగపేట మండలంలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. ఉపాధ్యాయురాలి భర్త, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు.. మరో ఉపాధ్యాయురాలితో కొంతకాలంగా వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఉపాధ్యాయురాలి భర్త మహబూబాబాద్‌ జిల్లా కేంద్రంలో ఏఆర్‌ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. దీంతో కూతురితో అద్దె ఇంట్లో ఉంటున్న ఉపాధ్యాయురాలు, అప్పటికే ఇద్దరు భార్యలను వదిలేసి ఒంటరిగా ఉంటున్న ఉపాధ్యాయుడు నాగేందర్‌కు దగ్గరైంది. సెలవు రోజుల్లో వచ్చి వెళ్తే భర్తను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడంతో అనుమానం వచ్చి కూతురు ద్వారా ఆరా తీయగా అసలు విషయం తెలుసుకున్నాడు. ఈ విషయంపై రెండు నెలల క్రితం పాఠశాల హెచ్‌ఎంకు ఫిర్యాదు చేశాడు. తన భార్యకు దూరంగా ఉండాలని నాగేందర్‌ను తీవ్రస్థాయిలో హెచ్చరించాడు. స్పందించిన అధికారులు ఉపాధ్యాయురాలిని మరో పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపించారు. అయినప్పటికి నాగేందర్‌, ఉపాధ్యాయురాలితో వివాహేతర సంబంధం కొనసాగిస్తూనే ఉన్నాడు. ఈ క్రమంలోనే ఉపాధ్యాయురాలు భర్త కానిస్టేబుల్‌ ఈ నెల 18న శివరాత్రి బందోబస్తు డ్యూటీపై వేములవాడకు వెళ్లాడు. సోమవారం సెలవు ఉండటంతో మంగపేటలో ఉంటున్న భార్య, కూతురును చూసేందుకు వచ్చాడు. అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో నాగేందర్‌.. ఉపాధ్యాయురాలి సెల్‌కు ఫోన్‌చేయగా భర్త లిఫ్ట్‌ చేశాడు. 'నేను వస్తున్నా తలుపు తీసి ఉంచు'అని నాగేందర్‌ చెప్పాడు. తన అనుమానం నిజమైందని భావించిన భర్త తలుపు తీసి బాత్‌రూంలో దాక్కున్నాడు. నాగేందర్‌ ఇంట్లోకి రాగానే గడియ పెట్టి ఇంతరాత్రి ఇంటికి ఎందుకు వచ్చావు అని అడుగుతున్న క్రమంలో పడుకుని ఉన్న తన భార్య, నాగేందర్‌ ఇద్దరు కలిసి అతనిపైనే దాడి చేసేందుకు యత్నించారు. దీంతో భయపడిన అతను ఇంటి గడియపెట్టి బయటకు వచ్చి ఇరుగుపొరుగుకు చెప్పాడు. ఉదయం తాళ్లతో ఇద్దరిని బంధించి పోలీసులకు అప్పగించారు.

పోలీసుల అదుపులో అంతర్రాష్ట్ర దొంగ?

జనగామ: జనగామ పట్టణం వాసవీనగర్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీకి పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగను జనగామ పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. చోరీ జరిగిన ఆరు గంటల్లోనే కేసును చేధించారు. రాష్ట్రంతో పాటు పలు రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. వాసవీనగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో పట్టపగలే చోరీకి పాల్పడి 9 తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.40వేల నగదు ఎత్తుకెళ్లిన సంగతి తెలిసిందే. విషయం తెలుసుకున్న ఏసీపీ దేవేందర్‌ రెడ్డి, సీఐ ఎలబోయిన శ్రీనివాస్‌ రంగంలోకి దిగి, సీసీ ఫుటేజీల సాయంతో దొంగను పట్టుకున్నట్లు తెలిసింది. సదరు నిందితుడిపై మూడు రాష్ట్రాల్లో కేసులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం.

దుగ్గొండి మండల కేంద్రానికి చెందిన ప్రముఖ న్యాయవాది కుసుమ జగదీష్‌–శిరీష దంపతుల కుమారులు సందేష్‌గౌతమ్‌– సందేష్‌వివేక్‌ కవలలు. ప్రతియేట వీరిద్దరి పుట్టిన రోజుతో పాటు కవలల దినోత్సవం రోజు కూడా వీరికి తల్లిదండ్రులు పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్నారు.


సందేష్‌గౌతమ్‌- సందేష్‌వివేక్‌

అచ్చం ఒకేలా..

- అబ్బుర పరుస్తున్న ట్విన్స్‌
- నేడు అంతర్జాతీయ కవలల దినోత్సవం

కవల పిల్లలు అంటేనే వారికో ప్రత్యేక గుర్తింపు. ప్రతిఒక్కరు ఆసక్తిగా గమనిస్తారు. ఒకే రకమైన రూపురేఖలు.. ఒకే రకమైన దుస్తులు ధరించడం వారి ప్రత్యేకత. చాలా మంది కవలలు కనీసం గుర్తు పట్టలేని విధంగా అచ్చం ఒకేలా ఉంటారు. నేడు (బుధవారం) అంతర్జాతీయ కవలల దినోత్సవం సందర్భంగా వారి తల్లిదండ్రుల మనోభావాలు మీకోసం..

–నర్సంపేట/దుగ్గొండి

దుగ్గొండి మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన పల్లె శ్రీనివాస్‌–వందన దంపతులకు కవల పిల్లలు హిమ ప్రియ– కీర్తిప్రియ ఉన్నారు. 4వ తరగతి చదువుతున్నారు. వీరిని కుటుంబ సభ్యులు మినహా ఎవరూ గుర్తుపట్టరు.


హిమ ప్రియ- కీర్తిప్రియ

దేవుడి వరంలా భావిస్తాం..

మాకు మొదటి సంతానంలో కవల కూతుళ్లు జన్మించడం దేవుడిచ్చిన వరంలా భావిస్తాం. ఇద్దరికి ఒకే రకమైన వస్త్రాలు కొనుగోలు చేసి ఆనందాన్ని పంచుకుంటాం. ఇద్దరు కూతుళ్లు కూడా ఒకరిని విడిచి మరొకరు ఉండరు. బంధువులు ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని ప్రేమను పంచడంతో మురిసిపోతాం.


తల్లిదండ్రులు విజయ్‌కుమార్‌ప్రమీలతో కార్తీజాన్వి, కృతిజాన్వి

–అజ్మీర విజయ్‌కుమార్‌ప్రమీల, బోజ్యానాయక్‌తండా

అభిరుచులు ఒకటే..

మొదటి సంతానంలో కుమారుడు జన్మించగా రెండో సంతానంలో ఒకే పోలికతో జన్మించిన దీపిక, దీక్షితరెడ్డిల అభిరుచులు ఒకే విధంగా ఉంటాయి. ఆటపాటలతో పాటు చదువుల్లో కూడా ప్రతిభ కనబరుస్తారు. బంధువుల ఇళ్లకు వెళ్లినప్పుడు ఇద్దరు కలిసి వెళ్తారు. కొత్త వారు చూసినప్పుడు ఎవరి పేరు ఏమిటో గుర్తు పట్టలేని విధంగా ఉండడం సంతోషాన్ని కలిగిస్తుంది.



–తల్లిదండ్రులు నరేశ్‌రెడ్డి,లావణ్యతో దీపిక, దీక్షితరెడ్డి

ఐక్యంగా ఉంటారు..

మాకు మొదటి సంతానంలో కవలలు జన్మించారు. వీరికి ఫుర్ఖాన్‌, అఫాన్‌లుగా పేర్లు పెట్టాం. ఇద్దరు ఐక్యంగా ఉండడంతో పాటు ఒకరిని విడిచి ఒకరు ఉండలేరు. కవల పిల్లలు జన్మించడం, వారి పోలికలు కూడా ఒకేలా ఉండడం ఆనందాన్ని కలిగిస్తుంది.



–తల్లిదండ్రులు ఫయాజుద్దీన్‌,ఆరిఫాబేగంతో ఫుర్ఖాన్‌, అఫాన్‌

ఉచ్చుకు బలైంది చిరుతపులే!

- నిందితుడు తీసిన ఫొటోల ఆధారంగా గుర్తింపు
- సీసీఎంబీ నుంచి రిపోర్ట్‌ వచ్చాకే అధికారిక వెల్లడి

భూపాలపల్లి: భూపాలపల్లి అడవుల్లో ఉచ్చుకు బలైంది చిరుత పులి అని అటవీశాఖ అధికారులు నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే.. పదిహేను రోజుల క్రితం భూపాలపల్లి రేంజ్‌ పరిధిలోని రాంపూర్‌ సెక్షన్‌లో రాజీవ్‌నగర్‌ నుంచి పంబాపూర్‌ వెళ్లే దారిలో వేటగాళ్లు అమర్చిన ఉచ్చుకు పులి బలి అయినట్లు పుకార్లు షికార్లు చేశాయి. చనిపోయిన పులిని వేటగాళ్లు ఖననం చేసినట్లు చర్చ జరిగింది. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు ఖననం చేసిన స్థలం కోసం రెండు రోజుల పాటు తీవ్రంగా గాలించినప్పటికి ఫలితం లేకపోయింది. దీంతో అనుమానితులైన ఇద్దరిని ఈ నెల 15న రాత్రి అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ విచారణలో వేటకు బలైన అటవీ జంతువు ఏదనేది వారు పూర్తిగా సమాచారం ఇవ్వలేదు. దహనం చేసిన స్థలాన్ని చూపించగా అధికారులు అక్కడ ఉన్న ఎముకలు, పూర్తిగా కాలని కాలు, పుర్రెను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ మేరకు 16వ తేదీన నిందితులను కోర్టులో హాజరు పరిచారు. అయితే చనిపోయింది పులి అని ప్రచారం జరిగినప్పటికీ, అది చిరుతపులి అని అధికారులు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. నిందితుడి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లో చనిపోయిన చిరుత పులి ఫొటోను గుర్తించి అదే కోర్టులో అందజేసినట్లు సమాచారం. పశు వైద్యశాఖ అధికారులు పూర్తి స్థాయిలో నిర్ధారణకు రాని కారణంగా సెంటర్‌ ఫర్‌ సెల్యులార్‌ అండ్‌ మాలిక్యులర్‌ బయోలజీ (సీసీఎంబీ) రిపోర్టు కోసం వేచి చూస్తున్నట్లు తెలిసింది. నిందితుడి సెల్‌ఫోన్‌లో లభించిన ఫొటోతో పాటు ఉచ్చులు అమర్చిన స్థలంలో పాదముద్రలు (పగ్‌ మార్క్స్‌) ఆధారంగా అది పక్కా చిరుత పులేనని భావిస్తున్నారు. జిల్లా అడవుల్లో ఇంత వేట జరుగుతున్నా.. ఒక చిరుత పులి బలైనా సంబంధిత అధికారులు, సిబ్బందిపై అటవీశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


ఉచ్చుకు బలైన అనంతరం నిందితుడు తీసిన చిరుతపులి ఫొటో

పోస్టాఫీస్‌ బ్యాంకింగ్‌ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

- హనుమకొండ డివిజన్‌ తపాలా సూపరింటెండెంట్‌ బానోత్‌ నందా

హన్మకొండ: పోస్టాఫీస్‌ సేవింగ్‌ బ్యాంకింగ్‌ మేళాను సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ డివిజన్‌ తపాలా సూపరింటెండెంట్‌ బానోత్‌ నందా అన్నారు. మంగళవారం హనుమకొండలోని తపాలా డివిజన్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 6 ప్రధాన పోస్టాఫీస్‌లు, 49 సబ్‌ పోస్టాఫీస్‌లు, 337 బ్రాంచి పోస్టాఫీస్‌లో ఈ నెల 24 వరకు పోస్టాఫీస్‌ సేవింగ్‌ బ్యాంకింగ్‌ మేళా జరుగుతుందన్నారు. ప్రజల్లో సేవింగ్‌ ఖాతాలు, తపాలా స్కీమ్‌లపై అవగాహన కల్పిస్తారన్నారు. తపాలా స్కీంల్లో పొదుపు చేసిన ఖాతాదారులకు బ్యాంకులతో పోలిస్తే అధిక వడ్డీ చెల్లిస్తున్నట్లు చెప్పారు. పోస్టాఫీస్‌ సేవింగ్స్‌ ఖాతా ద్వారా 4 శాతం వడ్డీ రేటును అందిస్తుందన్నారు. ఖాతాలో పొదుపు చేసిన సొమ్ముకు ఆదాయం పన్ను మినహాయింపు కూడా ఉంటుందన్నారు. పోస్టాఫీస్‌ టైమ్‌ డిపాజిట్‌ ఖాతా ద్వారా 5 సంవత్సరాల వరకు పన్ను ప్రయోజనం పొందే అవకాశముందన్నారు. వీటితో పాటు పోస్టాఫీస్‌ నెలవారీ ఆదాయ పథకం ఖాతా, సీనియర్‌ సిటిజన్‌ సేవింగ్‌ స్కీమ్‌, 15 సంవత్సరాల పబ్లిక్‌ ప్రావిడెంట్‌ ఫండ్‌ ఖాతా, నేషనల్‌ సేవింగ్‌ సర్టిఫికెట్లు, కిసాన్‌ వికాస్‌ పత్ర, సుకన్య సమృద్ధి యోజన పథకం, హోల్‌ లైఫ్‌ అస్యూరెన్స్‌ ప్లాన్‌ సురక్ష, పీఎల్‌ఐ ఎండోమెంట్‌ అస్యూరెన్స్‌ ప్లాన్‌ సంతోష్‌, సువిధ, సుమంగల్‌, యుగల్‌ సురక్ష స్కీమ్‌లున్నాయన్నారు. ఖాతాదారులు నచ్చిన స్కీమ్‌లో పొదుపు చేసే అవకాశముంటుందన్నారు.


మాట్లాడుతున్న బానోత్‌ నందా

గంజాయి స్మగ్లింగ్‌ ముఠా అరెస్ట్‌

- రూ.34 లక్షల విలువైన గంజాయి స్వాధీనం
- ఉప సర్పంచ్‌తో సహా నలుగురు అరెస్ట్‌


అరెస్ట్‌ వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కరుణాకర్‌

వరంగల్‌ క్రైం: వరంగల్‌ కమిషనరేట్‌ పరిధిలో గంజాయ స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ముఠా టాస్క్‌ఫోర్స్‌, ఆత్మకూరు పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేసినట్లు ఈస్ట్‌జోన్‌ డీసీపీ పుల్ల కరుణాకర్‌ తెలిపారు. ఉపసర్పంచ్‌తో పాటు నలుగురు ముఠా సభ్యులను అరెస్టు చేసి వారి నుంచి రూ.34 లక్షల విలువగల 170 కిలోల గంజాయి, కారు, బొలెరో వాహనం, మూడు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం గొరుకొత్తపల్లికి చెందిన రాయినేని శంకర్‌, వరంగల్‌ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామానికి చెందిన ముసిక లక్ష్మణ్‌, ములుగు జిల్లా బండారుపల్లి గ్రామానికి చెందిన మాత్ర మహేష్‌, పస్రాకు చెందిన గండికోట సతీష్‌లను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. నిందితులు రాయినేని శంకర్‌, ఆత్మకూరు మండలం నీరుకుళ్ల ఉపసర్పంచ్‌ ముసిక లక్ష్మణ్‌ సులభంగా డబ్బు సంపాదించాలని ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రంలో గంజాయి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్మాలని ప్రణాళిక రూపొందించుకున్నారు. ఏపీలోని నర్సీపట్నంకు చెందిన పరారీలో ఉన్న నిందితుడు నూకరాజు ద్వారా 170 కిలోల గంజాయిని కొనుగోలు చేసి రెండు కిలోల చొప్పున ప్యాకెట్లు చేసి బొలెరో వాహనంలో ఎవరికి అనుమానం రాకుండా కొబ్బరి బొండాల మధ్యలో రహస్యంగా భద్రపర్చి వరంగల్‌కు తరలిస్తున్నారు. గంజాయిని వరంగల్‌కు తరలిస్తున్న క్రమంలో నిందితులు రాయినేని శంకర్‌, ముసిక లక్ష్మణ్‌లు కారులో ఎస్కార్ట్‌గా గంజాయి తరలిస్తున్న వాహనానికి వెళ్లారు. మంగళవారం ఆత్మకూరు గ్రామ శివారు ప్రాంతంలో నిర్వహించిన తనిఖీల్లో అనుమానాస్పదంగా వస్తున్న నిందితుల వాహనాలను తనిఖీ చేయగా బొలెరో వాహనంలో కొబ్బరి బోండాల మధ్య గంజాయి ప్యాకెట్లు దొరికినట్లు డీసీపీ కరుణాకర్‌ వెల్లడించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన పరకాల ఏసీపీ శివరామయ్య, టాస్క్‌ఫోర్స్‌ ఇన్‌స్పెక్టర్లు కె.శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, ఆత్మకూరు ఇన్‌స్పెక్టర్‌ బి.కుమార్‌, టాస్క్‌ఫోర్స్‌ ఎస్సైలు వడ్డెబోయిన లవణ్‌కుమార్‌, నిసార్‌పాషా, హెడ్‌ కానిస్టేబుల్‌ స్వర్ణలత, కానిస్టేబుళ్లు శ్యామ్‌, రాజు, భిక్షపతి, సురేష్‌, శ్రవణ్‌, నవీన్‌, కరుణాకర్‌లను ఈస్ట్‌ జోన్‌ డీసీపీ కరుణాకర్‌ అభినందించారు.

గుండెపోటుతో హెడ్‌ కానిస్టేబుల్‌ మృతి

ఖిలా వరంగల్‌: కానిస్టేబుల్‌ నుంచి హెడ్‌ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందడంతో ఆ కుటుంబం ఆనందంలో మునిగిపోయింది. మరికొద్ది రోజుల్లో హెడ్‌ కానిస్టేబుల్‌ శిక్షణ పూర్తి అవుతుందని, తమ కలలు నెరవేరే రోజు దగ్గరలోనే ఉందని సంతోష పడ్డారు. కానీ గుండెపోటుతో కానరాని లోకాలకు వెళ్లారు. వివరాలిలా ఉన్నాయి.. హైదరాబాద్‌ నాంపెల్లి పోలీస్‌ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వి.లక్ష్మీనారాయణ (54)కు హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందాడు. 42 రోజుల పాటు హెడ్‌కానిస్టేబుల్‌ శిక్షణ కోసం వరంగల్‌ మామునూరు పోలీస్‌ శిక్షణ కళాశాలకు ఈనెల 6న శిక్షణలో చేరాడు. మహాశివరాత్రి సందర్భంగా శని, ఆదివారం రెండురోజులు సెలవులు రావడంతో హైదరాబాద్‌లోని తన ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం 9 గంటలలోపే తిరిగి ట్రైనింగ్‌లో చేరాడు. అదేరోజు రాత్రి 8 గంటలకు వాంతులు విరోచనాలు కావడంతో గమనించిన పోలీస్‌ అధికారులు ఎంజీఎంకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హన్మకొండ, హైదరాబాద్‌లోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. లక్ష్మీనారాయణకు భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. లక్ష్మీనారాయణ మృతి చెందడంతో పీటీసీ ప్రిన్సిపల్‌ ఇంజారపు పూజ, పోలీస్‌ అధికారులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేసి, నివాళులర్పించారు. డీఎస్పీలు శ్రీనివాస్‌, రమేష్‌, ఆర్‌ఐలు చంద్రశేఖర్‌, నవీన్‌, కాశీరాం, మహేష్‌, శ్రీకాంత్‌, సీఎల్‌ఐ నరేష్‌కుమార్‌, రవీందర్‌, రాజ్యలక్ష్మీ, ఏఎల్‌ఐ రాధిక, మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ సుధీర్‌, పీఆర్‌ఓ రామాచారి ఉన్నారు.


లక్ష్మీనారాయణ (ఫైల్‌)

పథకం ప్రకారమే హత్యాయత్నం

- అపస్మారక స్థితిలో బాధితుడు ఉమేశ్‌
- భార్య, తల్లిదండ్రులు, మేనమామలపై కేసు నమోదు
- వివరాలు వెల్లడించిన సీఐ విశ్వేశ్వర్‌

దేవరుప్పుల: జనగామ జిల్లా దేవరుప్పుల మండలం చిన్నమడూరుకు చెందిన కూరాకుల ఉమేశ్‌పై అత్తింటివారు దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేయగా ముగ్గురిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు పంపినట్లు పాలకుర్తి సీఐ విశ్వేశ్వర్‌ తెలిపారు. మంగళవారం ఆయన హత్యాయత్నానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. చిన్నమడూరుకు చెందిన ఉమేశ్‌తో లింగాలఘనపురం మండలం కళ్లెంకు చెందిన మానుపాటి స్రవంతితో గతేడాది మే నెలలో వివాహం జరిగింది. మూడు నెలలకే భార్యభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడి గొడవ కావడంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. ఈ విషయమై భర్త ఉమేశ్‌పై లింగాలఘనపురం పీఎస్‌లో కేసు నమోదు అయింది. ఓ వైపు పీఎస్‌లో కేసు నడుస్తుండగా మరోవైపు ఉమేశ్‌ ఇంటికి మాట్లాడేందుకని నమ్మబలికి సోమవారం (20న) ఉదయం 10 గంటలకు చిన్నమడూరుకు చేరుకున్న భార్య స్రవంతి, తల్లిదండ్రులు మానుపాటి రాములమ్మ, కుమార్‌తోపాటు లింగాలఘనపురం మండలం బండ్లగూడెంకు చెందిన మేనమామలు దేవరాయ ఏలేందర్‌, ఆంజనేయులు కలిసి వెంట తెచ్చుకున్న కత్తులతో ఉమేశ్‌పై దాడిచేసి తీవ్రంగా గాయపర్చడంతో రక్తపుమడుగును చూసి మృతి చెందాడని భావించిన సదరు ఐదుగురు పరారయ్యారు. అపస్మారక స్థితిలో ఉన్న ఉమేశ్‌ను కుటుంబ సభ్యులు జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో సికింద్రాబాద్‌ గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై బాధితుడి తండ్రి యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టగా సింగరాజుపల్లి బస్టాండు వద్ద కుమార్‌, ఏలేందర్‌, ఆంజనేయులును అరెస్టు చేసి విచారించగా నేరం ఒప్పుకున్నారు. ముగ్గురిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఎస్సై రమేశ్‌నాయక్‌, హెడ్‌కానిస్టేబుల్‌ సదానందం, యాకుబ్‌ తదితరులు ఉన్నారు.



నిందితుల అరెస్ట్‌ చూపుతున్న సీఐ విశ్వేశ్వర్‌

అత్యాచార నిందితుడికి జైలు

కాళేశ్వరం: జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌ మండలం అన్నారం పరిధిలో ఓ యువతిపై ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లాకు చెందిన గండి చిన్నమ్మనాయుడు అత్యాచారం కేసులో భూపాలపల్లి జిల్లా సెషన్స్‌ కోర్టు జడ్జి నారాయణబాబు ఏడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 30వేల జరిమానా విధించారు. వివరాలిలా ఉన్నాయి.. 2016లో కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో నిందితుడిపై అత్యాచారం కేసు నమోదు కాగా ఆ కేసును అప్పటి కాటారం డీఎస్పీ కేఆర్‌కే ప్రసాదరావు దర్యాప్తు చేసి, చార్జ్‌షీట్‌ వేశారు. దీంతో మంగళవారం ట్రయల్‌లో ప్రభుత్వం తరఫున న్యాయవాది అడిషనల్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ జి.శివరాజ్‌ బాధితుల పక్షాన వాదనలు వినిపించి నేరస్తునికి శిక్షపడేలా చేశారు. కోర్టు కానిస్టేబుల్‌ వరలక్ష్మీ, భిక్షపతిలను జిల్లా ఎస్పీ సురేందర్‌రెడ్డి అభినందించినట్లు కాళేశ్వరం ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు.

పురుగుల మందుతాగి రైతు ఆత్మహత్య

ములుగు రూరల్‌(గోవిందరావుపేట): పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గోవిందరావుపేట మండలం చల్వాయిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కన్నగంటి ప్రభాకర్‌చారి (53) తన సొంత భూమితో పాటు 5 ఎకరాలు కౌలు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. సాగు చేసిన పంట ఆశించిన దిగుబడి రాకపోవడం, అప్పులు తీర్చ లేక కూతురి పెళ్లి ఎలా చేయాలనే మనోవేదనకు గురై ఈ నెల 19న ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి ప్రభాకర్‌చారిని ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య మణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కర్ణాకర్‌రావు తెలిపారు.

కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్‌

వరంగల్‌ క్రైం: తెలంగాణ కాంగ్రెస్‌ చీఫ్‌ రేవంత్‌రెడ్డి పాదయాత్రలో బందోబస్తు విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్‌ షుకూర్‌ తెలిపారు. ఈనెల 20న రేవంత్‌రెడ్డి పాదయాత్రలో కానిస్టేబుల్‌ సాదిక్‌ పాషా రోప్‌ బందోబస్తు విధులు నిర్వర్తిస్తున్నాడు. కమలాపూర్‌ మండలం మరిపెల్లిగూడెంకు చెందిన ఉప్పుల శివప్రసాద్‌ రోప్‌ పార్టీని దాటుకొని రేవంత్‌రెడ్డిని కలిసేందుకు వెళ్లే క్రమంలో సాధిక్‌ పాషా అడ్డుకున్నాడు. దీంతో కక్ష కట్టిన నిందితుడు ఉద్దేశ పూర్వకంగా ఏషియన్‌ మాల్‌ ప్రాంతంలో దాడి చేసి తీవ్రంగా గాయపర్చినట్లు ఆయన తెలిపారు. పోలీసు అధికారుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఇన్‌స్పెక్టర్‌ షుకూర్‌ తెలిపారు.

కంచె వద్దు.. ప్రత్యామ్నాయం ముద్దు

- విద్యుత్‌ కంచెలతో ప్రాణాలు పోగొట్టుకుంటున్న రైతులు
- వీటి ఏర్పాటుకు అనుమతులు లేవంటున్న అధికారులు
- ఇతర రక్షణ చర్యలతో పంటలను కాపాడుకోవాలని సూచన
- నాలుగు రోజుల వ్యవధిలో ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మృత్యువాత

- ఈ నెల 18న జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం బసిరెడ్డిపల్లికి చెందిన బండకింది నర్సింహులు (42) వరి పొలంలో నీరు చూడడానికి వెళ్లాడు. పక్క భూమి గల బండారు రాజయ్య అనే రైతు పంట రక్షణకు అడవిపందుల నివారణకు పొలం చుట్టూ ఉన్న ఇనుప ముళ్లకంచెకు కరెంటు షాక్‌ పెట్టాడు. అది గమనించని నర్సింహులు ఇనుప కంచె తగిలి కరెంటు షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు.
- తాజాగా మహబూబాబాద్‌ జిల్లా చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి గ్రామ పంచాయతీ దుమ్లా తండాకు చెందిన అంగోతు సీవీ నాయక్‌ తమ మొక్కజొన్న పంటను కోతుల నుంచి రక్షించుకోవడానికి విద్యుత్‌ వైర్లతో అక్రమంగా కంచె ఏర్పాటు చేశాడు. మంగళవారం వేకువజామున సీవీ నాయక్‌ కుమారుడు కిరణ్‌తో కలిసి కాపలా వెళ్లారు. కిరణ్‌ ఆదమరిచి విద్యుత్‌ ప్రవాహమున్న వైర్లపై పడిపోవడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. కుమారుడిని రక్షించేందుకు వెళ్లిన తండ్రి విద్యుత్‌ షాక్‌కు గురై మృతి చెందారు.

హన్మకొండ: జంతువులు ఇతర వన్యప్రాణుల నుంచి పంటలను కాపాడుకునేందుకు అక్రమంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్‌ కంచెలతో ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. విద్యుత్‌ కంచెలు ఏర్పాటు చేయొద్దని విద్యుత్‌ అధికారులు, టీఎస్‌ ఎన్పీడీసీఎల్‌ యాజమాన్యం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా.. అవేమి పట్టనట్లు కొందరు వ్యవహరిస్తున్న తీరుతో ప్రాణనష్టం కలుగుతుంది. వన్యప్రాణుల నుంచి పంటలను కాపాడేందుకు ముళ్ల కంచెలతో పాటు, ఇతర మొక్కలు నాటే పద్ధతులు అనాదిగా వస్తున్నాయి. వీటిని కాదని అధిక వోల్టేజీతో విద్యుత్‌ ప్రసరణ జరిగే లోహపు తీగలతో ఏర్పాటు చేస్తున్న విద్యుత్‌ కంచెలు ప్రాణాంతకంగా మారుతున్నాయి. పంటల రక్షణకు ఏర్పాటు చేస్తున్న లోహపు తీగను పశువులు, జంతువులు, వన్యప్రాణులు, వ్యక్తులు తాకినప్పుడు విద్యుదాఘాతానికి గురవుతూ ప్రాణనష్టం జరుగుతుంది. కొంతమంది వన్యప్రాణులను వేటాడేందుకు సైతం విద్యుత్‌ తీగలతో ఉచ్చులు ఏర్పాటు చేస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.


కిరణ్‌ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ప్రమాదమని తెలిసినా..

రైతులు పంటలు కాపాడుకునేందుకు విద్యుత్‌ తీగలు ఏర్పాటు చేయడం ప్రమాదమని తెలిసినా కంచెలు ఏర్పాటు చేస్తూనే ఉన్నారు. విద్యుత్‌ కంచె ఏర్పాటు చేసుకున్న సమాచారం తెలియని పక్క రైతులు, పశువులు అటు వైపు వెళ్లడంతో విద్యుత్‌ షాక్‌కు గురవుతూ విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. విద్యుత్‌ కంచెలు ఏర్పాటు చేస్తున్న వారిపై అధికారులు కేసులు నమోదు చేయిస్తున్నారు.

ప్రత్యామ్నాయాల ఏర్పాటు..

పశువులు, కోతులు, ఇతర వన్యప్రాణుల నుంచి పంటలు కాపాడుకునేందుకు ప్రత్యామ్నాయ పద్ధతులవైపు ఆలోచించాలని ఎన్పీడీసీఎల్‌ అధికారులు చెబుతున్నారు. రికార్డింగ్‌ మైక్‌లు, ఇతర శబ్ధాలు వచ్చే పరికరాల ఏర్పాటుతో కూడా అడవి జంతువుల బెడద తగ్గించుకోవచ్చని తెలిపారు.